# స్వచ్ఛభారత్ బాట.. పల్లెవాసుల మాట

గ్రామీణులు చైతన్యమవుతున్నారు. ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలను అందిపుచ్చుకుంటున్నారు. అందుకు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుంటున్నారు. ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటున్నారు. బహిరంగ మల విసర్జనకు స్వస్తి చెబుతున్నారు. పలు గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్లు నిర్మాణమయ్యాయి. కావలి నియోజకవర్గంలో తొమ్మిది గ్రామాల్లో ప్రతి ఇంట్లో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకున్నారు. ఆదర్శంగానిలుస్తున్నారు. ఈనేపథ్యంలోఈగ్రామాలపై స్ఫూర్తిదాయక కథనం.

- మరుగుదొడ్ల నిర్మాణంలో ఆదర్శం
- సర్పంచులు, సహజ నాయకుల కృషి
- జిల్లా కలెక్టరు నుంచి అభినందనలు



ఆర్.సి.పాలెంలో నిర్మించిన మరుగుదొడ్డి

**నియోజకవర్గంలో మరుగుదొడ్ల నిర్మాణం ఇలా**

| మండలం | పంచాయతీలు | గ్రీన్‌ఛానల్ పంచాయతీలు | ఓడీఎఫ్ గ్రామాలు |
|---|---|---|---|
| అల్లూరు | 13 | 10 | 2 |
| బోగోలు | 16 | 8 | 2 |
| దగదర్తి | 20 | 7 | 2 |
| కావలి | 18 | 15 | 3 |

కావలి (పురపాలకం) న్యూస్‌టుడే

దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వచ్ఛాంధ్రకు పిలుపునిచ్చారు. అనేక రోగాలకు బహిరంగ మలవిసర్జన కారణమని గుర్తించి ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు నిర్మించుకున్న వెంటనే నిధులు మంజూరు చేసేందుకు వెనుకాడడంలేదు. ఇలా మరుగుదొడ్ల నిర్మించుకోవడంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. ఇందుకు బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు పంచాయతీల సర్పంచులు, సహజ నాయకులు కృషిచేశారు. గ్రామాల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రజలను చైతన్యం చేశారు. రేయింబవళ్లు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఆత్మగౌరవరం పేరిట పల్లెనిద్రకు వచ్చే అధికారులతో కలిసి గ్రామస్థులను ఒప్పించారు. నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా కృషిచేశారు. మరుగుదొడ్లను ఉపయోగించుకునేందుకు అనేక విన్నూత్న కార్యక్రమాలతో వ్యయప్రయాసాలు పడ్డారు.. ఇలా బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా (ఓడీఎఫ్) తీర్చిదిద్దుకుని ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు.

- కావలి నియోజకవర్గంలో కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాలు ఉన్నాయి. మొత్తం 67 పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకు 40 పంచాయతీలను గ్రీన్‌ఛానల్ ( మరుగుదొడ్డి నిర్మించుకోగానే బిల్లులు మంజూరు) గ్రామాలుగా ఎంపికచేశారు. ఇప్పటికే తొమ్మిది పంచాయతీలు బహిరంగ మలవిసర్జన రహిత పంచాయతీలుగా (ఓడీఎఫ్) మారాయి. ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన పంచాయతీల్లోనూ నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకునేలా మండల అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కలెక్టరు నుంచి అభినందనలు పొందుతున్న కావలి మండలంలోని ఓడీఎఫ్ పంచాయతీల సర్పంచులు, మండలఅధికారులు

## గ్రామస్థుల సహకారంతోనే

–మల్లికార్జున, సర్పంచి
ఆర్.సి.పాలెం కావలి మండలం



గ్రామంలో నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు కష్టపడ్డాం. మొదట్లో బిల్లులు చెల్లింపు గజిబిజీగా ఉండేది. ఆత్మగౌరవరం పథకం వచ్చాక నిర్మించుకోవడం జిల్లాలోనే మా పంచాయతీ మొదటిగా నిర్మించాం. చాలా పంచాయతీలకు మాగ్రామాన్ని చూపించి అవగాహన కల్పించడం మా పంచాయతీకే గర్వకారణం. మండల అధికారులు తహశీల్దారు కె.సాంబశివరావు, ఎంపీడీవో జ్యోతి, ఈవోపీర్డీ ఆదినారాయణ, స్థానిక ఏఎన్ఎంలు, అంగనవాడీ కార్యకర్తలు అందరం కలిసి అందరూ మరుగుదొడ్లు ఉపయోగించుకునేలా గ్రామస్థుల్లో చైతన్యం తీసుకొచ్చాం.

## గతంలో ఎన్నో అవస్థలుపడ్డాం

–లక్ష్మమ్మ, ఆర్.సిపాలెం



మరుగుదొడ్లు నూరు శాతం నిర్మాణం జరిగాయంటే మా సర్పంచి మల్లికార్జున కృషే కారణం. మొదట్లో చాలా మంది వ్యతిరేకించారు. తర్వాత అందరికి అర్థం అయ్యేలా అవగాహన కల్పించడంతో మహిళలంతా ముందుకొచ్చారు. గతంలో మహిళలమంతా ఊరిబయటకు వెళ్లేవాళ్లం. అటుగా పురుషులు వస్తే అవస్థలు పడేవారం. రాత్రిళ్లు ఇబ్బందులుపడ్డాం. ఈ పరిస్థితి ఇప్పుడు మాగ్రామంలో లేదు.

## మహిళల ఆత్మగౌరవం కాపాడినట్లే

రమాదేవి, చెంచుగానిపాలెం సర్పంచి



మా గ్రామంలో మొన్నటివరకు మరుగుదొడ్డి అనేది లేదు. ప్రభుత్వం ఆత్మగౌరవరం పథకం తీసుకొచ్చాక పట్టుదలతో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా కృషిచేశాం. మాగ్రామం చుట్టూ వరిపొలాలే ఉన్నాయి. మహిళలు ఆరుబయట మలవిసర్జనకు వెళ్లి అనేక అవస్థలు పడేవారు. ఇప్పుడు ప్రతి ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకున్నారు. మహిళల ఆత్మగౌరవరం కాపాడుకున్నాం.